# ఎర్ర గులాబీ

శ్రీ వి. వి. బి. రామారావు

'ఏయ్! కొంచెం చూసుకోకూడదూ? ఏమిటా హడావుడి' అంటూ లేచాను. కూలివాడు తెస్తున్నపెట్టె కాలివేళ్లకు తగిలింది. రాత్రి చాలా సేపు క్రింద బర్తుమీద రైల్వే గుమాస్తాతో మాటాడు తొంటే గడచిపోయింది. తెల్లవారేసరికి విజయవాడ స్టేషన్లో కోలాహలం. ఎలానూ తెలివి వచ్చేసిందికదా అని క్రిందకి దిగి చూశాను. రైల్వే గుమాస్తా ఎవరి తోనో మాటాడుతున్నాడు.

'ఇంక రైలుమీదకి పోదు సార్. ఇక్కడ దిగి ఊళ్లోకి వెళ్లడం మంచిది. ఉక్కు కర్మాగారం ఆందో ళనకారులు ఎక్కడంటే అక్కడ రైళ్లు ఆపేస్తు న్నారట.'

'చచ్చాం' అనుకున్నాను.

'ఏమండీ, అయితే ఇప్పుడేం చేద్దాం?'

'ఈ ఊళ్లో మీ వాళ్లెవరూ లేరా?'

'లేరండీ, అయినా పండగ శలవలకని బయలు దేరాను. ఇల్లు వదలి అప్పుడే ఆరునెలలైంది. రేప యినా బయలుదేరుతుందా?'

'అబ్బే అది ఎవరికీ తెలియదండీ. ఒక రోజుతో పరిష్కారమయ్యేటట్టులేదీ సమస్య.'

'పోనీ బస్సులేమన్నా ఉన్నయ్యేమో?'

'చూద్దాం రండి. నాకూ విశాఖ వెళ్లాల్సిన జరుగురు పని ఉంది. ఎందుకేనా మంచిది రిటై రింగ్ రూమ్‌లో సామాన్లు పడేసి పోదాం. ఓ రోజు అద్దెపోతే పోతుంది.'

ఇద్దరం స్నానాలుచేసి క్రింద రెస్టారెంటులో కాఫీ ఫలహారాలు ముగించుకుని బస్ స్టాండ్‌కు వెళ్లాం. ఓ అరగంటక్రితం రాజమండ్రి వెళ్లవలసిన బస్సు వెళ్లిపోయిందన్నారు. కాని పూర్తిగా గమ్యం చేరు తుందనే నమ్మకం ఎవరికీ లేదట. పోనీ లారీ ఏదైన ప్రయత్నం చేద్దామన్నా సామాన్లు తెచ్చుకొనేవరకు వాడుండవద్దూ? చేసేదిలేక రిటైరింగు రూమ్‌కి వచ్చాము. సాయంకాలం ఊసుపోక ఇద్దరం సినిమాకు వెళ్లాము. ఏదో హిందీ సినిమా చూసి పదింటికి గదికి చేరాం.

ఎప్పటికప్పుడే రైలు వచ్చేస్తుందనుకున్నాము. రెండు రోజులు గడిచాయి. పరిస్థితి మెరుగుపడలేదు. నా జేబులో డబ్బులైపోయాయి. ప్లాటు ఫారంమీద ఆగిపోయిన ప్రయాణీకులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. వాళ్ల ధర్మమా అంటూ గది అద్దె కూడా అడగలేదు. మాకు భోజనం బేరర్ గదికే తెచ్చేవాడు: విల్స్ పాకెట్స్‌కోసం క్యూలో నిలబడ్డ వాళ్లను చూస్తే జాలివేసేది. ఉచిత భోజనం చేస్తూ రెండు పూటలయ్యింది. ఏం చెయ్యడమా అని ఆలో చిస్తున్నాను రోజు పొద్దున్నే. రైల్వే గుమాస్తా రమణ మూర్తి ఆదరాబాదరా లోపలికి పరిగెత్తుకొచ్చాడు. 'టాక్సీ ఒకటి హైదరాబాదు పోతోంది. మళ్లీ గొడవలు చల్లబడిన తరువాత విశాఖపట్నం వెళ్ల వచ్చు. నేవస్తా రావుగారూ' అంటూ పెట్టె బెడ్డింగు పట్టించుకుని వెళ్లిపోయాడు.

నాకు మతి పోయినట్టయింది.

'గది చిమ్మమంటారా?' అంటూ ఒకమ్మాయి వచ్చింది చేతిలో చీపురుంది. లేకపోతే గది చిమ్మే అమ్మాయిలా కనపడలేదు. 'ఎంత నాజూగ్గా ఉంది'

అనుకుని బయటకువచ్చి నిలబడ్డాను. ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తున్నాను. గది తుడిచి అమ్మాయి వెళిపోయింది. నాకు ఠక్కున జ్ఞాపకం వచ్చింది మామయ్య సంగతి.

అప్పటి నాకైదారేళ్లుండవచ్చు — తాతగారింటి వద్ద పెద్ద రాద్ధాంతం. ఆ సంఘటన నా మనస్సుకు గట్టిగా హత్తుకుపోయింది. మామయ్యను తాతగారు గట్టిగా కొట్టారు. మామయ్యంటే నాకెంతో ఇష్టం. నాతో ఆటలాడేవాడు. కథలు చెప్పేవాడు. 'కమ్యూనిస్టు' అంటే అప్పుడు నాకేం తెలిసేది కాదు. ఏదో ఘోతమైన తిట్టు అనుకునేవాడిని. ఆ మాట తాతగారనేసరికి మామయ్య తాతగారిమీద ఎదురు తిరిగాడు. 'ఛీ, వెధవా, నీ మొహం నాకు చూపించకు. ఎలా బ్రతుకుతావో; బ్రతుకు, ఫో.' రాజమండ్రి కాలేజీలో చదువుకున్న మావయ్య మళ్లీ ఇంటికి రాలేదు. అడపా తడపా నాన్నగారు, అమ్మ మామయ్య గురించి మాటాడుకుంటున్నప్పుడు వింటుండేవాడిని. మామయ్య సంఘసంస్కర్తగా మారాడట. నిరీశ్వరవాది ఐపోయాట్ట. హరిజనుల అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడట. నాన్నగారు నామీద కోపం వస్తే 'ఓయ్, నీ కొడుకు మీ అన్నలా తయారౌతాడేమోనే' అంటూ ఉండేవారు.

తాతగారు, అమ్మమ్మ మామయ్య గురించి ఎప్పుడూ మాటాడేవారు కాదు. కాని దిగులుగా ఎప్పుడూ, ఏదో ఆలోచిస్తూ ఉండేవారు. అమమ్మ పోయినప్పుడుకాని మరో రెండేళ్ల తరువాత తాతగారు పోయినప్పుడుకాని మామయ్య మరి రాలేదు. తాతగారు ఆస్తి అమ్మపేర వ్రాశేశారు. ఎంత సంఘసంస్కర్త అయితే మాత్రం తల్లిమీదా, తండ్రిమీదా అంత అక్కసా అనుకునేవాడిని. మామయ్య హరిజనుల అమ్మాయిని ఎలా చేసుకోగలిగాడో వాళ్లకూ మనకూ ఎలా కుదురుతుంది? ఆశ్చర్యంగా ఉండేది నాకు.

మామయ్య ఏదో పత్రికకు సంపాదకుడిగా విజయవాడలో ఉంటున్నాడని జ్ఞాపకం వచ్చింది. ఆ పత్రిక పేరు జ్ఞాపకంలేదు...డబ్బులైపోయాయి. పోనీ మామయ్యకు కబురు పెడితే...

రూం ఎటెండెంట్ వచ్చాడు.

'అబ్బాయ్, ఓ పనిచేసి పెడతావా?'

'చెప్పండి సార్...ఎవరైనా ... అమ్మాయి... నసిగాడు.

ముందు నాకు బోధపడలేదు. తరువాత తట్టింది. 'చచ్చాం' అనుకున్నాను.

'ఏంలేదబ్బాయ్, ఈ ఊళ్ళో శాంతిస్వరూప్ అనే ఆయన ఉన్నాడు. ఆయన కెక్కడో ఓ ప్రెస్ ఉందట. ఆయన ఎక్కడుంటాడో నీ కేమైనా తెలుసా?'

'పత్రికాయన కదండీ...ఆ మాలోళ్ల అమ్మాయిని కట్టుకున్నాయనేనా ?' నా కేమనాలో తోచలేదు.

'నీవు వెళ్లి అతనికో ఉత్తరం ఇస్తాను. ఇచ్చి రాగలవా ?'

డైరీలో కాయితం చింపి రెండు వాక్యాలు రాశాను. 'ఓ వంద ఇస్తారు పట్టుకురా.'

'సరే సార్' అంటూ బయలుదేరాడు.

వాడు వెళ్లి గంటన్నరయింది. 'నన్నుచూసి ఏ ఇరవైఏళ్ళో అయింది. నేను జ్ఞాపకం ఉంటానా' అనుమానం వేసింది. పోనీ ఎడ్రసు కనుక్కొని నేనే వెళ్లిఉంటే. ఎందుకు పంపానా అనుకున్నాను. ఒకవేళ మామయ్య డబ్బిచ్చి వీడే నన్ను మోసంచేస్తే...గది చిమ్మడాని కొచ్చిన అమ్మాయి జ్ఞాపకం వచ్చింది... పోనీ వెళ్లకపోడమే మంచిది.

ఎప్పుడు నిద్రపట్టేసిందో. క్రింద ఆందోళనకారులు చేస్తున్న చప్పుళ్లకి తెలివి వచ్చింది. ప్లాటుఫారంమీద గడియారాలన్నీ ముక్కముక్కలయ్యాయి. వెయింగ్ మెషీన్లు అస్థిపంజరాల్లో నిలబడి ఉన్నాయి. ఎడ్వర్టయిజుమెంటు బోర్డులు, షోకేసులు ముక్కముక్కలయ్యాయి. నే కిందకొచ్చి చూసేసరికి ప్లాటుఫారం నిర్మానుష్యంగా, జుత్తు విరగబోసుకుని ఏడుస్తున్న స్త్రీ విషణ్ణవదనంలా ఉంది. 'ప్లాటుఫారం నాశనంచేస్తే ఉక్కు కర్మాగారం వస్తుందా' అమాయకంగా అనుకున్నాను.

మళ్లీ గది కెళ్లేసరికి రూమ్ ఎటెండెంట్ వెనక మరో ఆయనతో వస్తున్నాడు.

'ఏం అబ్బాయ్, డబ్బు తెచ్చావా ?'

'లే దబ్బాయ్, నేనే వచ్చాను, ఇంటికి పద.' వెనకాల వచ్చిన మనిషి మావయ్యే.

'ఏం మావయ్యా, ఎన్నాళ్లకు చూశాను!' మిగిలిన విషయాలు మరచిపోయాను.

'రైళ్లు ఎప్పుడు బయలుదేరుతాయో, ఇలా ఇక్కడెన్నాళ్లుంటావ్. పద ఇంటికి పోదాం' అన్నాడు మామయ్య.

స్వయంగా తానే వస్తాడనుకోలేదు. వెళ్లకపోతే మామయ్య ఏమనుకుంటాడో...వాళ్లే సంసారం ఓ సారి చూడాలనిపించింది. బెడ్డింగ్ సర్ది గదితాళం అధికారులకిచ్చి మామయ్యవెంట బయలుదేరాను.

మామయ్య లోపలకెళ్లి చెప్పాడు గామోసు. 'రా బాబా' అంటూ ఆవిడ బయటకు వచ్చింది. మాట చాలా యాసగా ఉంటుందనుకున్నాను. కాని ఉచ్చారణ స్వచ్ఛంగానే ఉంది.

'అత్తయ్యా' అనడానికి మనసు రాలేదు కాని 'బాగున్నారా' అని మాత్రం కుశల ప్రశ్న వేశాను.

నన్నుచూసి తలుపు వెనకాల ఓ అమ్మాయి మసలుతున్నట్టయింది.

'అలా లోపల దాక్కుంటావేం. రా అమ్మాయ్, ఇదిగో ఇతను నీ మేనత్త కొడుకు. రావ్‌జీ' అన్నాడు మామయ్య.

ఇవతలకొచ్చి 'నమస్కారం' అంది. మొహం దించుకుని కూర్చున్న వాడిని గుండె దడదడలాడుతుండగా తలెత్తి చూశాను. చామన చాయ. పొడుగ్గా ఉంది. నవ్వితే సొట్లుపడే బుగ్గలు. అమ్మాయి నవ్వు తొందరిపించింది. చక్కని పలువరుస. మాటలు తేటగా ఉన్నాయి. నా కంట్లోకి సూటిగా చూసి మాటాడుతోంది. నేనే కళ్లు తిప్పుకున్నాను.

'వడ్డించాను' అని లోపలనుండి పిలిచింది మామయ్య భార్య. భోజనం చెయ్యనని అనలేదు నేను. లేచి కాళ్లు కడుక్కున్నాను.

బెజవాడ స్టాండర్డ్ మెనూ, దోసకాయ పప్పు, గోంగూర పచ్చడీ, ఆవకాయా, కొంచెం కారం ఎక్కువైనా కమ్మగానే ఉన్నాయి. తలవంచుకుని తింటున్నాను.

'ఏం రావ్‌జీ, నాన్నా అమ్మా బావున్నారా?'

'బాగున్నారు' అని ఆపేశాను.

'ఏం చేస్తున్నావ్. చదువు పూర్తయ్యిందా... ఐఏయస్ లిస్టులో పేరుచూసి నువ్వేమో అనుకున్నాను.'

'అంత అదృష్టం లేదు మామయ్యా. బి. య్యే పాసయి ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ ట్రెయినింగవుతున్నా హైదరాబాదులో. నాన్నగారు ఇంకా ఆ చిన్న ఉద్యోగమే చేస్తున్నారు. నా చదువుకు డబ్బు చాలా కష్టం అయింది.'

కష్ట సుఖాలు తెలిసిన వాడివి. ఉద్యోగరీత్యా నీ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి మనమంతా ఉవ్విళ్లూరుతున్న సామ్యవాద సిద్ధాంతాలను అమలుపరచి దేశాభివృద్ధికి ఇతోధికంగా కృషిచెయ్యి. ఎంత మెల్లగా నడచినా మరో నాలుగు తరాలలో దేశం పూర్తిగా మారిపోతుంది. కొద్దిమంది కోట్లమందిని దోచుకు తినే అనాగరిక వ్యవస్థను కూలదొయ్యడానికి కృషి చెయ్యాలి మనమందరం. సామ్యవాద రథసారథుల్లో ఒకడివి. దేశాభ్యుదయంకోసం పనిచేసి మాకు తగ్గ...' ఆగిపొయ్యాడు మామయ్య. దగ్గునటించి 'మజ్జిగ పొయ్యవోయ్' అన్నాడు.

మామయ్య ఉద్రేకం నాకు అర్థం కాకపోలేదు. తను నమ్మే సిద్ధాంతాలకోసం అనల్పమైన త్యాగాలు చేశాడు తను.

'ఇన్నాళ్లు స్టేషన్లో ఎందుకున్నావ్ బాబూ, నేరుగా వచ్చేసే పనికదా?' మళ్లీ ఆమె కదిపింది.

'ఆ ఏం లేదండీ, ఎప్పటికప్పుడే బయలుదేరుతాయేమోనని.' మీ సంగతి నేను మరచిపోయానన్న నిజం చెప్పడానికి ధైర్యం లేకపోయింది.

'ఏదోలే బాబూ. మీ అమ్మకీ, నాన్నగారికీ కూడా మేం శత్రువులమైపోయాము. మమ్మల్ని చూస్తే వారికి అసహ్యం.' అన్నాడు మామయ్య.

'పోన్లెద్దురూ, అవన్నీ ఇప్పుడెందుకు!' 'అత్తయ్య' సులువుగా ఫర్ గెట్ ఎండ్ ఫర్ గివ్ అన్న సిద్ధాంతాన్ని నమ్ముతున్నట్టనిపించింది.

'మావయ్యా, నా గురించే అడిగావుకాని మీ అమ్మాయి సంగతి చెప్పావు కాదు.'

'అమ్మాయి పేరు కరుణ. స్టెల్లామారిస్‌లో బి. య్యే చదువుతోంది. నాకు తగ్గ కూతురు.. ఏమే అమ్మాయ్ అలా సిగ్గుపడతావేం.'

కరుణ మొహం సిగ్గుతో గులాబీలు పూసింది.

'ఏం, కరుణా, మీ ఊళ్లో చూడవలసిన వేమిటో చూపిస్తావా' చొరవచేసి మాట్లాడాను.

'నీకు ఏమి చూడాలనుందో చెబితే...'

'పోనీ నీకు చూపించాలనుకున్నవే చూపించు. సాయంకాలం వెళదాం.'

సాయంకాలం ఎండ తగ్గినతరువాత బయలు దేరాం. సన్నటి జరీ అంచున్న గులాబీచీర కట్టుకుంది కరుణ. ఎంతో సింపుల్‌గా ఉన్నా ఎంతో ఆకర్ష ణీయంగా ఉంది. ఘంటసాల పాత పాట 'సంజ వెలుంగులో...శశిరేఖవె నీవు' జ్ఞాపకం వచ్చింది. సంజ వెలుగు, పసిడిఛాయ, నారింజచెట్టు బ్యాగ్రౌండు ఎంత సున్నితంగా ఉంటాయి, సిగ్గులు చిందిస్తున్న గులాబీ సుందరి ఆకర్షణ విజయవాడలోని వేడిని మరిపింప చేసింది.

అలజడిదార్ల స్లోగన్స్‌తో ప్రతీ గోడా నాయకుల్ని ఆవేశపరచేటట్టున్నాయ్ (వాళ్లు వాటిని చూస్తే కద!). ఊళ్లో వాతావరణం టెన్షన్‌గా ఉంది. కొంచెంసేపు మేము మౌనంగానే నడిచాము. ఆడపిల్లల వెనక నడిచే అలవాటు లేదు నాకు. కొంచెం దూరం వెళ్లిన తరువాత 'కాఫీ తాగుదామా?' అన్నాను.

ఇద్దరం ఓ హోటల్లో జొరబడ్డాం. కాఫీ ఆర్డరు చేశాను. ఏం మాటాడాలో తోచలేదు. కనక దుర్గ గుడి ఎక్కడో తెలుసా?'

తెలుసంది.

కాఫీ తాగి బయలుదేరాం.

'కారు' అంటూ చెయ్యిపట్టుకు లాగాను.

'మా కలవాటే బావా' బావ అని పిలుస్తే ఇంత తియ్యగా ఉంటుందన్నమాట.

'నువ్వె ఫడేనా వస్తు ఉంటావా గుడికి?' ప్రశ్న పూర్తయిన తరువాత జ్ఞాపకం వచ్చింది మామయ్య మాట.

'గుడికా, నీకు దేవుడిమీద నమ్మకం ఉందా బావా?'

'బావుంది. దేవుడిమీద నమ్మకం లేకపోతే మరి దేనిమీద ఉంటుంది?'

'అయితే నువ్వు భాగవతాన్ని, రామాయణాన్ని, మహాభారతాన్ని నమ్ముతావన్న మాట.'

'నమ్మకపోడమేవిటి. అవి మనజాతి సంస్కృతికి ప్రతిబింబాలు. మన మత గ్రంథాలు.'

'ఇంతచదువూ ఏం చదివావు బావా నువ్వు. అవి మత గ్రంథాలా? కేవలం లెజండ్స్. ఇతిహాసాలు. రామాయణం మహాభారతం కేవలం కవులు వ్రాసిన కావ్యాలు కాపోతే చాలా ప్రాచీనమైనవే. భగవద్గీత ఇతిహాసంమీద ఆధారపడిన ఓ ఇంటలెక్చ్యువల్ డిస్కోర్స్.'

'పోనీ ఏసు క్రీస్తుని నమ్ముతావా?' స్టెల్లామారిస్‌లో చదవుతోందికదా అని అడిగాను.

'పోబావా! కన్యకు మాతృత్వమెలా సాధ్యం. పార్థినో జెనిసిస్, నేటి మానవుడి ఇంటలిజెన్స్‌కే అవమానకరం. కాని ఏసుక్రీస్తుని ఆదర్శమానవుడిగా మనందరికీ ఓ మోడల్‌గా ఒప్పుకోడానికి నా కభ్యంతరం లేదు.'

ఇంత మత విద్రోహకరమైన మాటలు ఇంత చిన్నపిల్ల. చక్కనిది అంటుంటే కష్టమనిపించింది. నా మొహంలో ఆవేశం మండింది.

'అయితే మరి నువ్వు దేన్ని నమ్ముతావు?'

'మనిషికి మనిషి తోడ్పడాలనీ, తోటిమనిషికోసం స్వార్థాన్ని కొంచెం సేపయినా మరిచిపోయి వీలైనంత సహాయం చేయాలనీ...'

'దానికీ దేముడిలో నమ్మకం ఉండడానికీ సంబంధం?'

గుడివీధి వచ్చేసింది.

కరుణకు అవకాశం దొరికింది మాట మార్చడానికి.

గుడివీధిలో ఎవరింట్లోనో పెళ్లి. మైకులోంచి మంత్రాలు వినపడుతున్నాయి.

'పెళ్లి మంత్రాలు మైకు ముందర చదువుతారేం' అనుకున్నాను. నా ముఖం చూసి

'అవి అలా చదివితే మైలపడిపోతాయనా, అంత బాధపడుతున్నావ్ !'

నేనేమీ అనలేదు.

'పూర్వకాలం పెళ్లిళ్లలో ఫెర్టిలిటీ రిచ్యుల్స్ చేసేవారు. మన కిప్పుడు కావలసినది అది కాదు. నువ్వింకా అమ్మమ్మ తాతగారిలాగే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నావా, బావా.'

నేనేం అనాలో తోచలేదు.

గుడి దగ్గరకు వచ్చేసాం.

'అదిగో బావా కనకదుర్గగుడి. నువ్వొక్కడివే వెళతావా, నన్ను రమ్మన్నావా, లోపలకు రావడానికి నాకేం అభ్యంతరంలేదు.

ఆడపిల్లను ఒక్కర్తిని బయట వదలివెళ్లేంత శివ్రంలేనివాడిని కాదు.

'రా లోపలకు పోదాం, ఇంతలో నువ్వు భక్తురాలవైపోవులే' అంటూ టెంకాయ, పళ్లు, పూజాద్రవ్యాలు కొని లోపలికి తీసుకెళ్లాను. పూజారి మంత్రాలు చదువుతూ నా పేరడిగాడు చెప్పాను. 'గోత్రం?' చెప్పాను.

నేను చెప్పిన సమాధానాలు వినిపించుకున్నట్టే లేదు. వల్లించేస్తున్నాడు...ధర్మపత్నీ సమేతస్య...మమ అనుకోండి...సహకుటుంబస్య, మమ ధర్మార్ధ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్ధం...' నేను కళ్లు మూసుకుని చేతులు జోడించాను. కరుణ చేతులు జోడించిందో లేదో చూడలేదు.

అర్చన ఐపోయినతరువాత మళ్లీ బయటపడ్డాం. ఓ పది గజాలు వెళ్లాక 'హలో కరుణా' అంటూ పలకరించాడు ఓ యువకుడు నన్ను పరిచయం చేసింది' ఈయన కుమార్ అని ఓ కార్యకర్త. చాలా సరదా ఐన మనిషి.' ఏదో చెబుతోంది. ఇద్దరం ముందుకు నడుస్తున్నాం. మరి కొంతదూరం పోయాక ఎవరో రోడ్డు తుడిచే మనిషిలా ఉంది. ఆమెను కరుణ పలకరించింది.

'ఏం గౌరీ, మూడు రోజులై పాతానికి రావడం లేదు?'

'చంటాడికొంట్లో బాగులేదమ్మా. రేపటినుండి వస్తా. వీరెవరమ్మా?'

'మా బావ లే,' ముసి ముసి నవ్వులు నవ్వింది.

నాకు ఆరాటం ఎక్కువైంది విశాఖ చేరడానికి.

దూరంనుండి రైలుకూత మేఘ ఘర్జనలా వినపడింది.

---